# వసుధ

- నల్లాన్ చక్రవర్తుల గోపీమాధవులు

"ప్చ్..! లాభంలేదు'' పెదవి విరిచారు అరగంట సేపట్నుండి రకరకాల పంచాంగాలన్నీ తిరగేస్తూ కూర్చున్న రామాచార్యులు.

ఆ మాట వినడం తనకు కొత్తేమీ కాదు కనుక పెద్దగా ఆశ్చర్యపోలేదు మంగతాయారు.

"లాభంలేదు తాయారూ! అమ్మాయి జాతకం అబ్బాయి జాతకంతో ఏ ఒక్కదాంట్లోనూ కలవడం లేదు'' తాయారు వినలేదనుకుని మళ్ళీ చెప్పారు రామాచార్యులు.

"విన్నాను'' నిర్లిప్తంగా, పొడిగా సమాధానమిచ్చింది తాయారు.

"రాశి, నక్షత్రం ఏ ఒక్కటీ కలవకపోతే నిండు నూరేళ్ళూ కలసి కాపురమెలా చేస్తారు? ప్చ్... కుదరదని చెప్పేస్తాను.''

అవును కాదనకుండా నిశ్శబ్దంగా భర్త మొహంలోకి చూసింది తాయారు. బహుశా ఆ చూపులోని తెలియని భావమేదో అతడి వెన్ను చరిచిందేమో.

"అలా నా మొహంలోకి చూస్తూ కూర్చోకపోతే ఓ కప్పు కాఫీ నా మొహాన తగలెయ్యొచ్చుగా'' కాస్త కోపంగా అన్నారు.

మౌనంగా లేచి వంటింట్లోకి నడిచిందామె.

యాభయ్యో పడిలో వున్న రామాచార్యులకు వసుధ ఒక్కతే సంతానం. వసుధకిప్పుడు ఇరవై ఎనిమిదేళ్లు. చాలా తెలివైన అమ్మాయి. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న తండ్రికి పదిహేనేళ్ళక్రితం యాక్సిడెంటులో ఒక కాలుపోయి దాంతోపాటు వున్న జీవనాధారమూ పోయినప్పటినుండీ, తల్లిదండ్రులకు కొడుకైనా, కూతురైనా తానే అనే పరిస్థితిని కూడా ధైర్యంగా ఎదుర్కొని ఓ్రపక్క స్కాలర్‌షిప్పులతో చదువుకుని బిఇడి పూర్తిచేసి గవర్నమెంటు టీచర్ ఉద్యోగం చేస్తోంది.

★★★

"అమ్మా! ఫోన్ పని చేస్తోందా?'' స్కూలు నుండి ఇంటికి రాగానే తల్లిని అడిగింది వసుధ.

"చేస్తోందమ్మా'' చెప్పింది మంగతాయారు.

"అదే నిన్నట్నుండీ డెడ్ అయ్యింది కదా, పొద్దున వెళ్ళేటప్పుడు టెలీ ఫోన్ ఆఫీసులో కంప్లైంట్ ఇచ్చి వెళ్లా'' తన మనసులోని ఉద్దేశ్యాన్ని కప్పిపుచ్చి కారణం వేరేది చెప్పినా తల్లి మనసు తేలిగ్గా పసిగట్టింది.


"వాళ్ళు ఫోను చేసారమ్మా. అబ్బాయికి నువ్వు చాలా బాగా నచ్చావుట. కట్నకానుకల ప్రసక్తే లేదన్నారు. కానీ నీ జాతకంతో అబ్బాయి జాతకం కలవట్లేదట. మీ నాన్నగారే కుదరదని చెప్పేశారు.''

క్లుప్తంగా విషయాన్ని కూతురికి చెప్పి అక్కడ్నించి వెళ్లిపోయింది మంగతాయారు. ఆ సమాధానం విన్న తరు[illegible] వసుధ మొహంలోని నిరాశా నిస్పృహలను [illegible] లిగేంత సాహసం చెయ్యలేకపోయింది.

★★★

ఆ రోజు ఆదివారం.

"అమ్మా వసుధా! త్వరగా తయారవ్వమ్మా



వాళ్లొచ్చే టైమైంది'' హాల్లోంచి కేకవేసారు రామాచార్యులు.

"ఆ...అలాగే నాన్నా'' లోపల్నించి సమాధానమిచ్చింది వసుధ. పెద్దగా ఆసక్తి లేకుండానే ముస్తాబయ్యింది. మరి కాసేపట్లో పెళ్లికొడుకు, అతని తల్లీ దండ్రీ, అక్కయ్యా నలుగురూ రావడం, టిఫిన్లూ కాఫీలు అనంతరం వసుధను చూడడం పూర్తయ్యాయి.

"అవునూ! అబ్బాయి ఉద్యోగం చేసేది ఎక్కడన్నారూ?'' అడిగారు రామాచార్యులు.

"అదేమిటోనండీ ఈకాలం చదువులేమిటో, ఉద్యోగాలేమిటో మనకర్థం కావు. నువ్వే చెప్పరా కార్తీక్'' చిరునవ్వుతో అంది అబ్బాయి తల్లి.

"రత్నమాలా డిజిటల్స్‌లో చీఫ్ విజువలైజర్‌గా చేస్తున్నానండీ'' వినయంగానే సమాధానం చెప్పాడు అబ్బాయి.

"ఆ కంపెనీ మూతపడదంటారా?'' అడిగారు రామాచార్యులు.

"మా కంపెనీ నడిపిస్తున్నది ఇద్దరు అనుభవజ్ఞులైన అన్నదమ్ములు. కేవలం రెండు బ్రాంచీలతో ప్రారంభమై పదిహేనేళ్ళల్లో ఇప్పుడు మొత్తం ఇండియాలో కలిపి ఇరవై బ్రాంచీలతో బ్రహ్మాండంగా నడుస్తోంది. నా కెరీర్ స్టార్టయ్యిందే అక్కడ- ఆరేళ్ళక్రితం. ఐనా సడెన్‌గా ఎందుకలా అడిగారు?'' కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు కార్తీక్.

"ఆ... ఏం లేదులెండి. ఈ రోజుల్లో ఈ ప్రైవేటు ఉద్యోగాలను నమ్ముకుంటే ఇంతే సంగతులు. ఎవరు ఎప్పుడు బోర్డు తిప్పేస్తారో ఎవరికి తెలుసు?'' పుల్లవిరుపుగా అన్నాడు రామాచార్యులు.

"బోర్డు తిప్పేస్తే మరో కంపెనీ చూసుకొంటాం. చదివిన చదువూ, సంపాదించిన అనుభవం గాల్లో కలసిపోవుకదండీ. ఆ మాటకొస్తే లక్షలు ఖర్చు పెట్టి అమెరికాదాకా వెళ్లిన పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కే లేదు జాబ్ సెక్యూరిటీ!'' అసహనంగా అన్నాడు కార్తీక్.

"నిజమేలెండి. అందుకే అన్నారు గవర్నమెంటు ఉద్యోగం, ఆస్తిపాస్తులు ఉన్నవాడికే పిల్లనివ్వాలని'' అన్నారు రామాచార్యులు.

ఆ మాటతో వచ్చే కోపాన్ని తమాయించుకుంటూ "నాకు గవర్నమెంటు ఉద్యోగం వుందనిగానీ, మాకు బాగా ఆస్తిపాస్తులున్నాయనిగానీ మీకు చెప్పిరాలేదు. అన్నీ తెలుసుకున్నాకే అమ్మాయిని చూసేందుకు మీరు పిలిస్తేనే వచ్చాం'' అన్నాడు కార్తీక్.

"ఆస్తిపాస్తుల గురించి మేం మిమ్మల్నడగవలసిన ప్రశ్న. అయినా అబ్బాయి చిన్నవాడేకదా. ఈ వయసులోనే నెలకు పదివేలు సంపాదిస్తున్నాడు. గవర్నమెంటు ఉద్యోగాలు ఈ రోజుల్లో ఎవరికి వస్తున్నాయి చెప్పండి...'' ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లిని వారిస్తూ-

"అమ్మా! జరిగిన అవమానం చాలు. పదండి'' అంటూ బయల్దేరదీసాడు కార్తీక్.

★★★

బాధపడడం అనే విషయం కూడా పాతబడిపోయిన వసుధ మర్నాటి నుండీ రొటీన్ లైఫ్‌లో పడిపోయింది. అన్ని గాయాలనూ మాన్పగల శక్తీ, అన్ని సమస్యలనూ పరిష్కరించగల శక్తీ బహుశా ఒక్క కాలానికే ఉందంటే అతిశయోక్తి కాదేమో!

★★★



"విష్ణుం విష్ణుర్వషట్కారో భూత భవ్య భవత్ ప్రభుః భూతహృత్ భూతాత్మా భూత భవనః...'' వేంకటేశ్వరస్వామి కోవెల శిఖరం పైనున్న మైకులోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కంఠస్వరం.

సాయంత్రం ఆరుగంటల సమయాన ఆ కోవెల పరిసరాలు ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉన్నాయి. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి హారతి, తీర్థప్రసాదాలు తీసుకుని వచ్చి మంటపంలో కూర్చుని ప్రశాంతంగా కళ్ళు మూసుకుంది వసుధ.

"వసుధా!'' అన్న పిలుపుతో కళ్ళు తెరిచింది. ఎదురుగా తన కొలీగ్ ప్రవల్లిక. ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్న తరువాత ఇక ఇంటికి వెళ్దామని బయలుదేరుతుండగా "అవునూ ఇందాక ఎవరే అతను?'' అడిగింది ప్రవల్లిక.

"ఎవరు?'' తిరిగి ప్రశ్నించింది వసుధ.

"ఇందాక నేను ఇటువేపు వస్తుండగా నీతో ఏదో మాట్లాడాలని కాబోలు నీ దగ్గరకు వచ్చాడు. మళ్ళీ నేను నీవైపు రావడం గమనించి వెనుదిరిగి వెళ్లిపోయాడు'' చెప్పింది ప్రవల్లిక.

అతనెవరో, తన దగ్గరకెందుకు రాబోయాడో, తనతో చెప్పాలనుకున్న విషయమేమిటో తెలియలేదు వసుధకు. కానీ తన జీవితంలో జరగబోయే ముఖ్యమైన మలుపుకు అతనే కారణమవుతాడని ఊహించలేకపోయింది.

★★★



## లెక్క

''నువ్వు నీ మొదటి భార్యని ఎందుకు హత్య చేసావు?'' అడిగాడు జడ్జి.

''రెండో భార్య చంపమంది'' చెప్పాడు ముద్దాయి.

''మరైతే రెండవ భార్యని కూడా ఎందుకు హత్య చేసినట్లు?''

''మూడో భార్య చంపమంది!''

''నీకెంతమంది భార్యలు?'' ఆశ్చర్యపోతూ అడిగాడు జడ్జి.

''ఇలాంటి ప్రశ్న సడెన్‌గా వేస్తే ఎలా సార్? కాస్త వ్యవధి ఇవ్వండి. గుర్తుకు తెచ్చుకుని చెబుతాను'' అన్నాడు ముద్దాయి.

## ఫెయిల్యూర్

''ఆమధ్య నువ్వు ఆనంద్ అనే కుర్రాడ్ని ప్రేమిస్తున్నట్లు చెప్పావు. ఏమైంది?'' అడిగింది అనంత.

''ఫెయిలయింది? నేనిప్పుడు అతన్ని ప్రేమించడంలేదు!''


''ఏం! ఎందుకుని?''

''అతని బ్యాంక్ బ్యాలెన్స్ అయిపోయింది'' సిన్సియర్‌గా చెప్పింది శ్రీవల్లి.



– భానుకిరణ్
(వారాసిగూడ)






"తమరి రాయబారం ఎంతవరకూ వచ్చింది మరి దిగారూ!" శేషుని అడిగింది విజయ.

"స్కూలు నుండి బయలుదేరిన అమ్మాయిని 'నిన్ను చూడాలని... ఓ మాట చెప్పాలనీ... అను కుంటూ సీరియస్‌గా ఫాలో అయ్యా'' చెప్పాడు శేషు.

"చూసావు. మరి చెప్పావా?''

"అలా అలా స్కూలునుండి బయలుదేరిన వసుధ వేంకటేశ్వరస్వామి కోవెలలోకి వెళ్లింది'' సినిమాల్లో ఫ్లాష్‌బ్యాక్ చెప్పేవాళ్ళు పెట్టినట్లుగా ఫేస్ పెట్టి చెప్పాడు.

"వెంకటేశ్వరస్వామి కోవెల... తరువాత?" డైలీ సీరియల్ ప్రేక్షకురాలిలాగా అడిగింది విజయ.

"అమ్మాయితోపాటు మనమూ వెళ్లాం కోవెలలోకి.

"మనమూ కాదు! నేను అనగా తమరొక్కరే'' నవ్వుని ఆపుకుంటూ మాట సవరించింది విజయ.

"అలా గుళ్ళోకి వెళ్లిన వసుధ ప్రదక్షిణలూ, హారతీ, తీర్థ ప్రసాదాలూ అన్నీ అయిన తరువాత మంటపంలోకి వెళ్లి కూర్చుంది. అప్పుడు అనుకున్నాడు ఈ శేషు... 'భలే మంచి సమయమూ మించినన్ దొరకదూ...' మెల్లగా ఆ అమ్మాయిని సమీపించాను...''

"ఆ...సమీపించి... చెప్పేశావా 'మనసంతా నువ్వే.. నా మనసంతా నువ్వే'' ఆసక్తిగా అడిగింది విజయ.

"లేదు ఎవరో వచ్చి తనని పలకరించేసరికి వెనుదిరిగి వచ్చేశాను'' అసలు విషయం చెప్పాడు శేషు.

"తుస్...స్... ఇంతేనా?'' ఇంత బిల్డప్ ఇచ్చి చెప్పే విషయం ఇదా అన్నట్లు నిట్టూర్చింది విజయ.

"బాబీ మై సచ్ భోల్ రహాహూ.. మేరేకో ఆ అమ్మాయే చాహియే. దూసరా అమ్మాయి అస్సలు వొద్దు నహీ చాహియే హై...'' సీలింగ్‌కేసి చూస్తూ చెప్పాడు శేషు.

"బాబూ ఆ మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ వదిలేసి ఏదో ఒకే భాషలో చెప్పు నాయనా'' నవ్వుతూ అంది విజయ.

"అది కాదు వదినా. అన్నయ్యకు చెప్పి నువ్వే ఏదో ఒక విధంగా కథ ముందుకు నడిపించరాదూ. వసుధలాంటి మంచి అమ్మాయి తోటి కోడలిగా రావడం నీకేకదూ లాభం.''

***

''లాభం లేదు విజయా! నేను చెబుతున్న విషయాన్ని పట్టించుకోకుండా జాతకాలు కుదరవంటూ ధడేల్మని ఫోన్ పెట్టేసిన వ్యక్తిని ఏం మొహం పెట్టుకుని పర్సనల్‌గా వెళ్లి కలవమంటావు?'' విస్తరి చుట్టూ ఔపోసన పట్టి పైకి లేస్తూ అన్నాడు కృష్ణమాచార్యులు.

పెరట్లో చెయ్యి కడుక్కుని వచ్చిన భర్తకు టవలు అందించి హాల్లోకొచ్చి కూర్చున్న తరువాత పోకలు చేతికిచ్చి మెల్లగా భర్తకు నచ్చచెప్పడం మొదలుపెట్టింది విజయ.

"ప్లీజ్! ఏదో ఒకటి చేయండి. పెళ్లిచూపుల్లో వసుధను చూడగానే పాపం మనసు పారేసుకున్నాడు మన శేషు. ఈ సంబంధం కుదరకపోతే అదీ అమ్మాయి వాళ్ల తరఫు నుండి కాదనిపించుకోవడంతో హర్ట్ అవుతాడు. తను సంతోషంగా ఉండేలా చూసుకోవడం అన్నావదినలుగా మన బాధ్యత.''

'సరే'నంటూ తల ఊపారు కృష్ణమాచార్యులు.

***

"ట్రింగ్...ట్రింగ్...''మంటూ ఫోన్ మ్రోగిన శబ్దానికి కునికిపాట్లు పడుతూ కూర్చున్న రామాచార్యులు కుంటుతూ వెళ్లి రిసీవర్ ఎత్తి "హలో'' అన్నారు.

"నమస్కారమండీ! నా పేరు కృష్ణమాచార్యులు. వారాసిగూడనుండి మాట్లాడుతున్నాను.''

"చెప్పండి.'' "పదిరోజుల క్రితం మీ అమ్మాయిని చూసి వెళ్లాం...''

"అవునూ... జాతకాలు కలవవని చెప్పేసాగా! మళ్ళీ ఫోన్ చేస్తున్నారేం?'' అవతలివైపు మాట మధ్యలోనే తుంచేస్తూ నిక్కచ్చిగా అన్నారు రామాచార్యులు.

"దయచేసి వినండి. నేను దాదాపు ఇరవయ్యేళ్ళుగా పౌరోహిత్యం వృత్తిలో వున్నవాడ్ని. ఎన్నో జంటలకు జాతకచక్రాలు చూసి లగ్నాలు జరిపించినవాడ్ని. నాకే అర్థం కానంత లెవెల్లో మీ అమ్మాయి, మా తమ్ముడి జాతకాలు కలవకపోవడమా?'' కృష్ణమాచార్యులు అంత గట్టిగా వాదించేసరికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు రామాచార్యులకు.

"అంటే... అదీ... ఆ.. మా అమ్మాయికిప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదనీ... సరే ఉంటాను'' తక్కున రిసీవర్ క్రెడిల్ మీద పెట్టేసాడు.

రామాచార్యుల మనోగతం అర్థమైన కృష్ణమాచార్యులు తన ఆలోచనలను మరో కోణంలోకి త్రిప్పారు.

***

"టీచర్! మీకోసం ఎవరో వచ్చారు'' క్లాసులో పాఠం చెబుతున్న వసుధ దగ్గరకు వచ్చి చెప్పాడు ప్యూను నరసింహం.

"నాకోసమా? ఎవరు?'' ఆశ్చర్యంగా అడిగింది వసుధ.

"ఎవరో అమ్మా పంతులుగారు'' చెప్పాడు.

"సరే స్టాఫ్‌రూమ్‌లో కూర్చోబెట్టు. మంచినీళ్ళూ అవీ ఇవ్వు. పది నిముషాల్లో క్లాసయిపోగానే వచ్చేస్తాను.''

'సరే'నని వెళ్లిపోయాడు నరసింహం.

క్లాసయిపోయాక స్టాఫ్ రూమ్‌కేసి నడుస్తున్న వసుధకి సస్పెన్స్‌గా వుంది. 'నాకోసమేమిటి, ఎవరో రావడమేమిటి?' అని ఆలోచిస్తూ నడవసాగింది.

తెల్లని లాల్చీ, ధోవతీ, పిలకా, నుదుట మూడు నామాలతో లావుగా వున్నాయన కూర్చుని ఉన్నారు. వసుధని చూస్తూనే చిరునవ్వుతో "బాగున్నావా అమ్మాయి?" అని పలకరించారు చనువుగా.

"నమస్కారమండీ! బాగున్నానండీ" అప్రయత్నంగా చేతులు జోడించింది.

"నీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడదామని వచ్చాను. మాట్లాడవచ్చా?" మర్యాదగానే అన్నా ఆ మాటల్లో హుందాతనం నిండిన ఆజ్ఞలాగా అనిపించింది వసుధకు.

'పర్సనల్' అన్న మాట వింటూనే ఏదో రాసుకుంటూ కూర్చునివున్న చంద్రం మాష్టారు నిశ్శబ్దంగా బయటకు వెళ్లిపోయారు.

"నన్ను గుర్తుపట్టే వుంటావు. పదిహేను రోజుల క్రితం మా తమ్ముడి కోసం నిన్ను చూడడానికి వచ్చాం" ఉపోద్ఘాతం ఇచ్చారు కృష్ణమాచార్యులు.

గుర్తు పట్టానన్నట్టుగా తల వూపింది వసుధ.

తర్వాత విషయమెలా మొదలు పెట్టాలో అర్థం కాలేదాయనకు. కొద్దిసేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"చూడమ్మాయ్! చక్కగా చదువుకున్నావు. పదిమందికి మంచీ చెడూ చెప్పే పవిత్రమైన వృత్తిలో వున్నావు. నేను చెప్పే విషయాలను అర్థం చేసుకోగల వివేకవంతురాలివనే అనుకుంటున్నాను. జీవితం అతి చిన్నదీ, అమూల్యమైనదీనూ. నీకు తోబుట్టువులేరుగా. నిన్ను ఓ చెల్లెలుగా భావించి చెబుతున్నాను" కృష్ణమాచార్యుల మాటల్లోని ఆత్మీయతకో, ఆప్యాయతతో కూడిన హితబోధనకు స్పందనగానో వెన్నలాంటి వసుధ హృదయం కరిగి కన్నీటి రూపంలో ప్రవహించింది.

"పెళ్లిచూపుల్లో నిన్నెంతగానో ఇష్టపడ్డ మా తమ్ముడు తన జీవితంలోకి నిన్ను ఆహ్వానించేటందుకు సిద్ధంగా ఉన్నాడు. మాకు చుట్టుపక్కల నాలుగు ఊర్లలోనూ పౌరోహిత్యం ఉంది. మా తమ్ముడికి చదువూ, పదివేల జీతమొచ్చే ఉద్యోగమూ వుంది. సొంత ఇల్లు, ఆస్తిపాస్తులకూ లోటు లేదు. నీ ఉద్యోగం చూసి ముందుకొచ్చామన్న అపోహ వద్దు. చిన్నప్పట్నుంచీ కష్టసుఖాలనూ- సారీ కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని జీవితంలో పైకొచ్చిన ఆత్మస్థైర్యంతో కూడిన నీ వ్యక్తిత్వంపట్ల గౌరవంతో నీకీ అవకాశం. సంతానంలేని మా మేనమామ అత్తయ్యలు మా తమ్ముడిక్కాబోయే భార్య పేర తమ ఆస్తి రాసెయ్యాలనీ, తామే స్వయంగా కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యాలనే సంకల్పంతో ఉన్నారు. ఒకబ్బాయి నీకంటే అంగుళం పొట్టిగా వున్నాడనీ, ఒకతనికి గవర్నమెంటు ఉద్యోగం లేదనీ, ఒకబ్బాయితో జాతకాలు కలవలేదనీ ఇలా వచ్చిన సంబంధాలన్నీ తప్పిపోవడం వెనక ఆంతర్యమేమిటో గ్రహించు."

ఆశ్చర్యంగా చూసింది వసుధ. ఆ చూపులోనీ భావం అర్థమై చిన్నగా నవ్వి చెప్పాడు.

"నీ విషయాలన్నీ నాకింత వివరంగా ఎలా తెలుసుననా? మీ అమ్మగారి పినతల్లి అవధానం లక్ష్మీదేవమ్మ- అదే బేగంపేటలో ఉంటారే. మాకు దూరపు బంధువవుతారు. ఆవిడ ద్వారా తెలుసుకునే నిన్ను చూడడానికొచ్చాం. సరే, అదీ విషయం. సరైన నిర్ణయం తీసుకునే అవకాశం నీదే. శుభం."

★★★

"ఏమండోయ్!" లోపలి గదిలోంచి మంగతాయారు పెట్టిన కేక విని ఉలిక్కిపడ్డ రామాచార్యులు-


"ఏమిటే, ఏం జరిగింది? ఎందుకా వెర్రికేకలు?" విసుక్కుని కర్ర తాటించుకుంటూ హాల్లోంచి లోపలికెళ్లాడు. చేతిలో రెపరెపలాడుతున్న ఒక కాగితంతో స్థాణువై నిలబడి వుంది తాయారు. ఆమె చేతిలోని ఉత్తరం తీసుకుని చదవసాగారు రామాచార్యులు.

"అమ్మా, నాన్నా! ఇలా పిలుస్తున్నందుకు క్షమించండి. పిలిచే అర్హత కూడా నాకుందో లేదో తెలియదు. ఎందుకంటే ఇది చదవడం పూర్తయిన తరువాత మాకెవరూ లేరు, మా కూతురు చచ్చిపోయింది అని అనుకుంటారేమో బహుశా.

ఆస్తిపాస్తుల వాటాలకోసం పోటీ పడడమే తప్ప బాధ్యతలను పంచుకోవడంలో ముందుకు రాని చాలామంది కూతుర్లలాగే నేను కూడా నా పెళ్లి తరువాత మీ జీవిత భద్రత గురించి ఆలోచించినందుకు పెద్ద మనసుతో నన్ను క్షమించండి. పెళ్లి ద్వారా నాకు సంక్రమించబోయే నాలుగు లక్షల ఆస్తిని మీ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నాను. దాని మీద వచ్చే వడ్డీ మీ శేష జీవితానికి చక్కగా ఉపయోగపడగలదు.

ఇప్పుడిక ఉద్యోగం చేయాల్సిన అవసరం నాకు లేదు. కనుక అవసరంలో ఉన్న మరొకరికోసం రిజైన్ చేసి నాతోపాటు మరికొంతమందికి ఉపాధి కల్పించి ఉన్నత విద్యా ప్రమాణాలతోపాటు ఉత్తమ మానవతా విలువలతో కూడిన భావి భారత పౌరులను తీర్చిదిద్దే చక్కటి ఆదర్శవంతమైన స్కూలు నెలకొల్పాలని వుంది. దయచేసి నాదొక రిక్వెస్టు. ఆ స్కూలుకి అమ్మ పేరు పెట్టుకుంటాను. సెలవు.

★



## రిక్షాలపై సుంకం

బంగ్లాదేశ్‌లాంటి బీద దేశంలో రిక్షాలు తొక్కేవాళ్ళు దాదాపు మూడులక్షలమంది ఉన్నారుట. ఢాకా నగరంలో నగర అందంతోపాటు రిక్షా తొక్కేవాళ్ళు ఎక్కువయిపోవడంతో అక్కడి పోలీసులు కొత్తరకం ఆంక్షలు విధించారుట. ట్రాఫిక్ సమస్య ఈ రిక్షావాళ్ళవల్లనే వస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రతి రిక్షావానికి అధికార లైసెన్స్ ఉండాలనీ, దీనికి కొంత సుంకం చెల్లించాలని ఆంక్షలు పెట్టడంతో అక్కడి రిక్షావాళ్ళు నానా ఇబ్బందులూ పడుతున్నారట. పొట్టకూటికోసం కష్టపడే తమలాంటి వారిమీద ఇలాంటి ఆంక్షలు విధిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారట. అంతేకాదు, పర్యావరణానికి తామేమాత్రం ఇబ్బంది కలిగించడం లేదని కూడా విన్నవించుకుంటున్నారట. వీరిని సమర్థిస్తూ కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చాయిట.

– శశి

